మహిళలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి



మేడిపల్లి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాథంగౌడ్ వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తూ.. ఆర్థికంగా ఎదిగినప్పుడు దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. లయన్ చారి, బింగి బిక్షపతి, మహేందర్‌రావు, పల్లె బాల్‌రాజ్‌గౌడ్, సందీప్, ప్రభాకర్, రవీందర్, చందన, సావిత్రి, దుర్గా, సమతాయాదవ్, అంగన్వాడీ టీచర్ షకీలా,రమాదేవి, టీచర్ మాధవి తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం



ఉప్పల్ టీచర్స్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన దృశ్యం


ఉప్పల్: ఉప్పల్ టీచర్స్ కాలనీలో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా సర్వే నంబర్ మార్చి కబ్జాకు యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలో సీతారామ కాలనీ, టీచర్స్ కాలనీల మధ్య ఉన్న ఈ స్థలం విలువ దాదాపుగా కోట్లల్లో ఉంటుందని దీనిపై కొందరు వ్యక్తులు ఎప్పటి నుంచో కన్నేసి ఉంచారని, ఆదివారం రావడంతో చదును చేస్తూ కబ్జాచేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు సోమవారం ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డికి ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకుని విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సరిపోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, నీటి నిల్వలు పెంచడానికి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బోరు మోటార్లకు మరమ్మతులు చేయించాలని, కొత్త బోర్లు వేయించాలని లేఖలో కోరారు. అన్ని ప్రాంతాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చిత్తారి యాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు సిద్ధం!

- ఉప్పల్ సర్కిల్ పరిధిలో 18 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 3,530 మంది విద్యార్థులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

రామంతాపూర్ : ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఉప్పల్ మండలం విద్యాధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడలలో ఏర్పాటు చేసిన 18 పరీక్షా కేంద్రాల్లో 5,530 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

ఉప్పల్ పరిధిలోని పరీక్షా కేంద్రాలు..

- సెయింట్ మార్క్ స్కూల్, ఉప్పల్, ప్రశాంత్‌నగర్.
- జెడ్పీహెచ్ఎస్ స్కూల్, కూరగాయాల మార్కెట్, ఉప్పల్.
- సెయింట్ జాన్ కాన్వెంట్, ఉప్పల్.
- సుజన హైస్కూల్ గాంధీ బొమ్మ, ఉప్పల్.
- జోషి విద్యాలయ ఎస్పీహెచ్ కాలనీ, ఉప్పల్.
- సాగర్ గ్రామర్ స్కూల్, భరత్‌నగర్.
- సెయింట్ గాబ్రియల్ హైస్కూల్, రాఘవేంద్రనగర్.

రామంతాపూర్ పరిధిలో...

- సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మెయిన్ రోడ్డు, రామంతాపూర్.
- చైతన్య భారతి హైస్కూల్ చిన్న చెరువు కట్ట వెనుక, శాంతినగర్.
- సాయిరాం కాన్వెంట్ హైస్కూల్ వెంకటొరెడ్డినగర్ బస్టాండ్.
- విశ్వశాంతి హైస్కూల్ అరవింద్‌నగర్.
- వైష్ణవి హైస్కూల్ దూరదర్శన్ కేంద్రం ఎదురు రోడ్డు, గణేష్‌నగర్.
- శ్రీ చైతన్య హైస్కూల్ భద్ర హోటల్ పక్కన మెయిన్ రోడ్డు

హబ్సిగూడ పరిధిలో...

- జహీర్ మెమోరియల్ హైస్కూల్, ఐఐసిటీ క్వార్టర్స్, హబ్సిగూడ, నాచారం రోడ్డు
- జాన్సన్ గ్రామర్ హైస్కూ ల్, హబ్సిగూడ, కాకతీయనగర్.
- జ్ఞాన భారతి హైస్కూల్ జై సంతోషినగర్, హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్- 8

ముమ్మర ఏర్పాట్లు చేశాం..



పరీక్ష కేంద్రానికి ఒక్కరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటుతో పాటు సూపరింటెండెంట్‌తో పాటు అధికారులను నియమించాం. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకునేలా ఆర్టీసీని ప్రత్యేక బస్సులు నడపాలని కోరాం. నిరంతర విద్యుత్, గాలి, వెలుతురుతో పాటు గదుల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం ఉన్న పాఠశాలలనే ఎంపిక చేశాం. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలి.

– రామారావు, ఉప్పల్ మండల విద్యాధికారి.

తల్లిదండ్రులు పాటించాల్సినవి...

- పరీక్షలు బాగా రాయలేకపోయావో అంతే సంగతి ర్యాంకు రాకపోతే నీ సంగతి చూస్తా అని పిల్లలను బెదిరించకూడదు.
- పరీక్షలు జరుగుతున్న సమయంలో తల్లిదండ్రులు టూర్లు పర్యటనలు రద్దు చేసుకోవడం మంచిది. బంధువులు, స్నేహితుల ఇంటికి పార్టీకి, ఫంక్షన్లకు వెళ్లకండి. మీ ఇంట్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేయొద్దు.
- పరీక్షలు ముగిసే వరకు ఇంట్లో కేబుల్ టీవీ ప్రసారాలకు విద్యార్థులను దూరంగా ఉంచాలి. పరీక్షలు అయిపోయే వరకు కేబుల్ టీవీ కనెక్షన్ కట్‌చేస్తే మంచిది.
- తల్లిదండ్రులు పెద్ద స్వరంతో మాట్లాడటం, గొడవలు పడటం, పరీక్షల సమయంలో మానుకోవాలి.
- విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా అనువైన గదిని ఏర్పాటు చేయాలి.
- మంచిర్యాంకు రావాలనే ఆశతో తెల్లవారులు విద్యార్థులను చదివిస్తే వారు సరైన నిద్రలేక అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.
- పరీక్షలు జరుగుతున్నన్ని రోజుల్లో విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే తక్షణ శక్తిని ఇచ్చే పోషకాహారాన్ని ఇవ్వాలి.
- విద్యార్థుల వెంబడి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు వెళ్లాలి. దీనిద్వారా వారిలో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. పరీక్ష హాల్‌లోకి అడుగు పెడుతున్న విద్యార్థిని పరీక్ష బాగా రాయి అని అనకంటి. నువ్వు బాగా రాస్తావు అని ధైర్యం చెప్పండి.

విద్యార్థులకు సూచనలు..

- విద్యార్థులు పరీక్షల కోసం చదివేటప్పుడు పరీక్షలకు వెళ్లేటప్పుడు ఆత్మ విశ్వాసంతో పాజిటివ్ మైండ్‌తో నేను తప్పకుండా పాస్ అవుతాననే ఆలోచనలతో ఉండాలి.
- ఏ సబ్జెక్టును ఎంత సేపు చదవాలో, ఏయే సమయంలో చదువుకోవాలో నిర్ణయించుకోవాలి.
- గంటల కొద్ది చదివే బదులుగా విశ్రాంతి తీసుకుంటూ ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా 2,3 గంటలు చదవాలి.
- పరీక్షల సమయంలో విద్యార్థులు ఇంట్లో వండిన ఆహారాన్ని తీసుకోవాలి. బయటి ఆహారాన్ని తీసుకోవద్దు.
- ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు చదివే సబ్జెక్టులు బాగా గుర్తుంటాయి.

భయం వీడితేనే విజయం..



చాలా మంది విద్యార్థుల్లో ఉన్న భయంతో పరీక్షల్లో విజయం సాధించలేక పోతున్నారు. భయాన్ని వీడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి ధైర్యం చెప్పాలి. సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలి.

– కనిగిరి ప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

గ్రేడ్ కాదు మార్కుల దిశగా అడుగులు..



పదో తరగతి పరీక్షలు మరి కొన్ని రోజుల్లో జరగనున్న నేపథ్యంలో విద్యార్థుల ప్రతిభకు సవాల్‌గా మారింది. గతేడాదిలో గ్రేడ్ పద్ధతిలో ఫలితాలను ఇచ్చేవారు కానీ ఇప్పటి నుంచి మార్కుల పద్ధతిలో ఫలితాలను ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఆ దిశగా విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి మెరుగైన మార్కులు సాధించడానికి కృషి చేయాలి.

– రంగనాథ్, తెలుగు ఉపాధ్యాయుడు, రామంతాపూర్

విహారయాత్రలతో విద్యార్థులకు మానసిక వికాసం



కాప్రా: విహారయాత్రలు దివ్యాంగ చిన్నారుల మానసిక వికాసం, సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుందని, అనురాగ్ దివ్యాంగుల స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ అన్నారు. సోమవారం స్కూల్ పిల్లలను తూముకుంట సమీపంలోని సమ్మర్ గ్రీన్ రిసార్ట్‌కు విహారయాత్రకు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను కొత్త ప్రదేశాలకు తీసుకెళ్లడంతో వారి మానసిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

ఆక్రమణల తొలగింపు



మల్లాపూర్: మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో ఇంటర్నల్ రోడ్డును ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను సోమవారం కాప్రా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీ సాయంతో కూల్చివేశారు. పలుమార్లు స్థానికులు రోడ్లను ఆక్రమించి టాయిలెట్, మెట్లు, అరుగులను నిర్మించారని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. టీపీఎస్ రాజేందర్, న్యాక్ ఇంజినీర్ అశ్వినీ, చైన్‌మెన్ బాల్‌రాజ్, గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌కు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ మంచాల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు హారిక తదితరులున్నారు.



ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

కాప్రా: పరువు హత్యలను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్ తోటకూర శ్రీకాంత్ అన్నారు. నల్లగొండ పరువు హత్యకేసులో ఆలస్యమైనా కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. దోషులకు పై కోర్టుల్లో శిక్షలు తగ్గించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పరువు హత్యలన్నింటికీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని నాచారం కార్పొరేటర్ శాంతి అన్నారు. సోమవారం నాచారం వార్డు కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ బహుమతులు అందజేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

మౌలాలి: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా కె.నరసింహాచారి, ఉపాధ్యక్షులుగా హబీబ్, మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్, సలీం, సంయుక్త కార్యదర్శులుగా ఇసాక్, జహంగీర్, ఉదయ్, కోశాధికారి విజయ్‌లు ఎన్నికయ్యారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ హనుమాన్‌పేట వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్యాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కృష్ణారావు, సెక్రటరీ దయాకర్, జాయింట్ సెక్రటరీగా శేఖర్, ట్రెజరర్‌గా వెంకటరమణ, సభ్యులుగా నాగేశ్వర్‌రావు, కృష్ణమోహన్, పీఎస్.కానుగో, షకీల్, శిరీష, రజిత, సలహాదారులుగా ఏసీవి.నర్సింహ్మారావు, వీరస్వామి, స్వామి ఎన్నికయ్యారు.

అక్రమంగా ఇసుక విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కుషాయిగూడ: అక్రమంగా ఇసుక విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 20 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సైనిక్‌పురి, భాస్కరరావునగర్‌లో అక్రమంగా ఇసుక విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి 20 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న రాఘవ రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. తాను ఇసుకను చక్రిపురంలోని లారీల అడ్డా వద్ద నుంచి అవసరమైన వారికి సప్లై చేస్తానన్నాడు. కాగా తన యజమాని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో మహిళలకు ప్రాధాన్యం : ఎమ్మెల్సీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మల్లాపూర్: బీఆర్‌ఎస్ హయాంలో మహిళలకు ప్రాధాన్యత కల్పించామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చీగుళ్ల శ్రీనివాస్, బాలమణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై 500 మంది మహిళలకు చీరలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఆరు గ్యారంటీలు అమలుకావడం లేదని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం రూ.2500, ఆడపచులకు తులం బంగారం ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ కులమతాలకు అతీతంగా మహిళలకు బతుకమ్మ చీరలు, రంజాన్ కానుకలను అందజేసేవారన్నారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



నాగార్జుననగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: దశలవారీగా కాలనీ సమస్యలకు పరిష్కారం చూపుతానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె చర్లపల్లి డివిజన్, నాగార్జుననగర్ కాలనీ రోడ్డు నెంబరు-2లో మురుగు సమస్యను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి తరచు పొంగుతున్న మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాలనీ అధ్యక్షుడు కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, మహేందర్‌గౌడ్, శ్రీశైలం, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- చర్లపల్లి, ఈసీనగర్ మహిళాభవన్‌లో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



మల్లన్న కల్యాణోత్సవంలో..

మల్లాపూర్: నాచారం శ్రీరాంనగర్ కాలనీలో బీజేపీ నేత శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పాతగాని గోపాల్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్‌రావు, మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు రాంప్రదీప్, రాజిరెడ్డి, చంద్రమౌళి, గోపి, నర్సింహ్మారెడ్డి, ఆనంద్‌గుప్తా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణమహోత్సవం..

కుషాయిగూడ: మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్‌లోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో జరుగుతున్న మల్లన్న కల్యాణమహోత్సవంలో సోమవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాప్రా: సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సావిత్రిబాయిపూలే సంఘ సంస్కర్తే కాకుండా మహిళలకు చదువు అవసరాన్ని గుర్తించి బాలికలకు విద్యను బోధించి ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా ప్రసిద్ధి చెందారన్నారు. ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం వెంకటసుబ్బయ్య, స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు శారద, శ్రీనివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, పీబీచారి, గౌస్య, శోభ, అంజలి, రుక్కయ్య, యాదగిరిరావు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రామంతాపూర్ : మహిళా అక్షరాస్యతకు ఎన్నో పోరాటాలు చేసిన సావిత్రిబాయి పూలేను మహిళలు స్ఫూర్తిగా తీసుకుని ఆడ పిల్లలందరినీ చదివించాలని కోరారు. సేవా సమితి అధ్యక్షుడు బుర్ర మహేందర్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ధీటి మల్లయ్య, లక్ష్మణ్, నరసింహ, సబిత, తులసి, అనురాధ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి..

మల్కాజిగిరి: సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళలు సమాజంలో చైతన్యవంతులు కావాలని ఐద్వా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వినోద అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ అంబేద్కర్‌భవన్‌లో ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో భాగంగా సెమినార్ నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిన్నతనంలోనే వివాహం అయినప్పటికీ చదువుకున్నారని, బాలికలకు చదువు ఆవశ్యకతను గుర్తించి మొదటి పాఠశాల ఏర్పాటు చేసి బోధన ప్రారంభించారన్నారు. ఐద్వా మండల ప్రధాన కార్యదర్శి మంగ, నాగమణి, శోభ, రాజ్యలక్ష్మి, లలిత, దీపిక, వైష్ణవి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నేతలు ఆమె విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

మానవసేవే మాధవ సేవ గ్రూప్ ఆధ్వర్యంలో...

గౌతంనగర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమానికి మహ్మద్ రషీద్, శ్రీరామ్‌యాదవ్, రాజు, రామ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

గౌతంనగర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు శేఖర్, రాజు, చక్రవర్తి, దాస్, మణి, డ్వాక్రా సంఘాల రీసోర్స్‌పర్సన్స్ ఇందిరాప్రియదర్శిని, భవాని, అశ్విని పాల్గొన్నారు.



గౌతంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో..



మానవసేవే మాధవ సేవ గ్రూప్ ఆధ్వర్యంలో..

స్వచ్ఛతకు తూట్లు !

- నిరుపయోగంగా టాయిలెట్లు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా

మౌలాలి: ప్రజల సౌకర్యం కోసం దాదాపు అన్ని డివిజన్లలో టాయిలెట్లను నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిఏటా జీహెచ్‌ఎంసీ అధికారులు స్వచ్ఛభారత్, స్వచ్ఛసర్వేక్షణ్ సమయంలో సుందరంగా అలంకరించి, బ్లీచింగ్ చల్లి ముగ్గులు వేసి శుభ్రం చేశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉండటంతో చేసేదేమిలేక పాదచారులు రోడ్డుపైనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతున్న సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా స్పందించి పాతవాటికి మరమ్మతులు చేపట్టి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వాజ్‌పేయినగర్‌లో..



సఫిల్‌గూడ మినీట్యాంక్ వద్ద..